

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

గంజాయి రహితంగా మార్చాలి

- బాపట్లలో రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేసి మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాపట్లలో రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యం చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలని, తాగునీటిని వేడిచేసి తాగాలని సూచించారు.

- అభివృద్ధికి సంబంధించి అన్ని విభాగాలలో జిల్లా మొదటి మూడుస్థానాల్లో ఉండాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. డీఆర్వో, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్‌తో కలిసి గ్రామశ్రేయస్సు, స్థితిస్థాపక ప్రణాళిక తయారీ, జీడీపీ ప్రణాళికల తయారీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.
- ఎస్టీలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్టీలు, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగులవద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



నిడుబ్రోలు - అప్పికట్ల రైల్వే సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన డైవర్షన్ మార్గంలో ప్రయాణిస్తున్న రైలు

సూపర్ ఫాస్ట్‌గా రైళ్లు

- 140 కిలోమీటర్ల వేగంతో రాకపోకలు
- నిరోధకాలకు చెక్‌తో వేగవంతంగా ప్రయాణం
- నిడుబ్రోలు-అప్పికట్ల మార్గంలో టెస్టురన్ విజయవంతం

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇక రైళ్లు సూపర్‌ఫాస్ట్‌గా రాకపోకలు సాగించనున్నాయి. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో వేగనిరోధకాలతో అటు విజయవాడ, ఇటు గుంటూరు డివిజన్ల నుంచి వచ్చే పలు రైళ్ల సమయపాలన అదుపుతప్పుతూ వస్తోంది. ఇక్కడ 10 కిలోమీటర్ల పొడవునా నేల స్వభావం సరిగా లేకపోవడంతో తరచుగా రైళ్ల పట్టాలు తప్పడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైళ్లను దాదాపుగా 32 కిలోమీటర్ల పొడవునా 75 నుంచి 90 కిలోమీటర్ల వేగానికి మించి నడపకుండా చూస్తున్నారు. దీని వల్ల ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు, వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లు కూడా ఈ సెక్షన్‌లో నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. సమయపాలన నష్టపోవాల్సి వస్తున్నది. హౌరా - చెన్నై రైలుమార్గంలో దశాబ్దాల తరబడి రైళ్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో శాశ్వత డైవర్షన్ పనులు పూర్తి అయ్యాయి. పదేళ్ల క్రితమే ఇక్కడి వాగుపై కొత్త వంతెన నిర్మించినప్పటికీ రైలుమార్గం డైవర్షన్ చేపట్టలేదు. ఎట్టకేలకు మూడు స్ట్రెచ్‌లలో ఆరు కట్ అండ్ కనెక్షన్లు చేశారు. పూర్తి అయిన శాశ్వత డైవర్షన్ సెక్షన్‌లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్టురన్ నిర్వహించింది. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేసింది. దీంతో కొద్ది రోజుల్లోనే ఈసెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండానే రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వేగం పెరిగి నిర్ణీత సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు. అలానే ఇతర డివిజన్లు, జోన్ల నుంచి రైళ్లను ఆలస్యంగా అందిస్తున్నారన్న ఫిర్యాదులకు కూడా ఫుల్‌స్టాప్ పడుతుంది.

ఎంత ప్రవాహం వచ్చినా తట్టుకునేలా..

నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో నేల స్వభావం పటిష్ఠంగా లేని కారణంగా రైలు మార్గం కోసం నిర్మించిన బండ్ ఒరిగిపోతున్నది. అంతేకాకుండా పాతవంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2014-19 మధ్య అప్పటి జలవనరుల శాఖ నూతన బ్రిడ్జిని నిర్మించింది. వాగులో ఎంత వరద ప్రవాహం వచ్చినా తట్టుకునేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలోనూ ఇబ్బంది లేకుండా డైవర్షన్ పనులను పూర్తి చేశారు.

కీలకమైన మార్గం..

ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కోస్తా తీరం పొడవునా హౌరా-చెన్నై రైలుమార్గాన్ని నిర్మించారు. దేశంలోని వివిధ రైలు మార్గాల్లో ఇదొక కీలకమైనది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే రైళ్లు కూడా విజయవాడ నుంచి హౌరా-చెన్నై రైలుమార్గంలో ప్రయాణించాల్సిందే. ఈ కారణంగా నిత్యం వందలాది సంఖ్యలో పాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లతో పాటు సరుకు రవాణాకు కూడా ఇదొక ముఖ్యమైన సెక్షన్. దీంతో గూడ్స్ రైళ్లు కూడా ప్రయాణిస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైలుమార్గంలో నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్ దశాబ్దాల తరబడి ఇబ్బందికరంగా పరిణమించింది.

అన్నపూర్ణాదేవిగా శ్రీబగళాముఖి



పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజు వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీబగళాముఖి అమ్మవారు భక్తులకు శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. చండీహోమాలు, కుంకుమార్చనలకు భక్తులు హాజరయ్యారని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

పొంచి ఉన్న వరద ముప్పు

- 9 లక్షలు క్యూసెక్కులు వచ్చే అవకాశం
- తీరప్రాంతవాసులను అప్రమత్తం చేసిన అధికారులు
- నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక



హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచక

రేపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం.. భారీ వర్షాలు.. ఎగువ నుంచి వరదతో కృష్ణానదీ తీర గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీవర్షం పడితే నదికి 8 నుంచి 9లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చే పరిస్థితి ఉందని అధికారులు భావిస్తున్నారు. వరద పోటెత్తే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతంలో 8 లక్షల క్యూసెక్కులతోనే కరకట్ట అంచుదాకా నీరు ప్రవహించింది. ప్రస్తుతం అదే స్థాయిలో వరద సంభవిస్తే కొంతమేర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలపై వరద ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు చేశారు.

భయపెడుతున్న కోతలు..

ప్రస్తుతం కరకట్టకు పిరాట్లంక, చెన్నుపల్లి వారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లు వేయడంతో ప్రమాద భరితంగా మారింది. భారీ స్థాయిలో కోసుకుపోవడంతో కరకట్ట దిగువనున్న షైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



హార్బర్‌లో ఒడ్డుకు చేరిన బోట్లు

సముద్రంలో అలల ఉధృతి..

సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. వాతావరణశాఖ ఆదేశాలతో శుక్రవారం నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణం ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. మత్స్యకారులు హార్బర్‌కు చేరుకున్నారు.

ఏఎంఆర్ చెక్‌పోస్టులు ధ్వంసం

- ప్రైవేటుకు సీనరేజ్ వసూళ్ల బాధ్యతపై ఆగ్రహం

బల్లికురవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మైనింగ్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. ఇందుకు సంబంధించి ఆ కంపెనీ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో మండలంలోని గ్రానైట్ రవాణా జరిగే పలు ప్రదేశాల్లో సంబంధిత కంపెనీ ఇనుప కంటైనర్ బాక్సులను ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టుల ఏర్పాటుపై గ్రానైట్ పరిశ్రమ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే పరిశ్రమల నిర్వహణ భారంగా మారిన పరిస్థితుల్లో చెక్‌పోస్టులతో మరిన్ని ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు గురువారం రాత్రి కొణిదెన, వేమవరం, మల్లాయపాలెం క్వారీల సమీపంలో ఏర్పాటు చేసిన కంటైనర్ బాక్సుల అద్దాలను ధ్వంసం చేశారు. చెక్ పోస్టులు ఏర్పాటైతే గ్రామాల్లో ఘర్షణలు కూడా జరిగే ప్రమాదం ఉందని గ్రామస్థులు తెలిపారు. గతంలో నాశిరకంగా ఉన్న రాళ్ల బిల్లులు లేకుండానే జరిగేవి.. ఇప్పుడు చెక్‌పోస్టులతో బిల్లు తప్పనిసరి. దీంతోనే గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది.



మల్లాయపాలెం సమీపంలో క్వారీలకు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన కంటైనర్ అద్దాలు ధ్వంసం చేసిన దృశ్యం



నవ్య

కుటుంబ కదంబం

శనివారం 27 ● సెప్టెంబరు 2025

వంటిల్లు

దసరా పండుగ వస్తుందనగానే రకరకాల పిండి వంటలు చేసుకుంటూ ఉంటాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వంటకం ప్రాశస్త్యంలో ఉంటుంది. మనం కూడా వాటిని ప్రయత్నించవచ్చు. ఎప్పటిలా కాకుండా ఈ పండుగ రోజున విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

విజయదశమికి వైరైటీగా..

పాల పాయసం (కేరళ)



కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం- అర కప్పు, చిక్కటి పాలు- ఒక లీటరు, పంచదార- ఒక కప్పు, యాలకులు- నాలుగు, కుంకుమ పువ్వు రేకులు- అయిదు, నెయ్యి- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, బాదం పలుకులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, ఉప్పు- చిటికెడు

తయారీ విధానం: బాస్మతి బియ్యంలో నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో మూడు కప్పుల నీళ్లు, కడిగిన బాస్మతి బియ్యం వేసి కలపాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించాలి. కుక్కర్ చల్లారాక మూత తీసి బాస్మతి అన్నాన్ని గరిటెతో మెత్తగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి బాగా మరిగించాలి. తరువాత అందులో బాస్మతి అన్నం మిశ్రమాన్ని వేసి బాగా కలుపుతూ పావుగంటసేపు ఉడికించాలి. ఆపైన పంచదార, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకులు వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత పాయసం గిన్నెను స్టవ్ మీద నుంచి దించాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు, బాదం పలుకులు, కిస్‌మిస్‌లు వేసి దోరగా వేయించి పాయసంలో కలపాలి. చివరగా చిటికెడు ఉప్పువేసి కలిపితే రుచికరమైన పాల పాయసం రెడీ!

దెహారోరి (చత్తీస్‌ఘర్)



కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒక కప్పు, పెరుగు- ఒక కప్పు, బేకింగ్ సోడా- అర చెంచా, బొంబాయి రవ్వ- రెండు చెంచాలు, పంచదార- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, నూనె- తగినంత, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని

తయారీ విధానం: వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, బేకింగ్ సోడా, బొంబాయిరవ్వ, యాలకుల పొడి, పెరుగు వేసి అరగ్లాసు నీళ్లు పోసి బాగా కలపాలి. ఆపైన గిన్నెమీద మూతపెట్టి నాలుగు గంటలు నాననివ్వాలి.

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చక్కెర వేసి కొన్ని నీళ్లు చిలకరించి వేడిచేయాలి. గులాబ్‌జామ్ పాకంలా రానివ్వాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. బియ్యప్పిండి మిశ్రమాన్ని చెంచాతో తీసుకుంటూ నూనెలో బోండాల మాదిరి వేయాలి. ఇవి దోరగా వేగిన తరువాత వాటిని తీసి పంచదార పాకంలో వేయాలి. పావుగంట తరువాత బోండాలన్నీ పూర్తిగా పాకం పీల్చుకుని దెహారోరీలు తయారవుతాయి. వీటి మీద జీడిపప్పు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయడమే.

ఈ రైతు బిడ్డ.. డీఎస్పీ



సంకల్పం

చిన్నప్పటి నుంచీ ఒకటే ఆశయం... ఉన్నత హోదా అలంకరించాలని. ఆ దృఢ సంకల్పమే ఆమెను లక్ష్యం వైపు నడిపించింది. కుటుంబ కష్టాలు... ప్రతికూల పరిస్థితులు... ఇవేవీ ఆమె అవరోధంగా భావించలేదు. చదివింది ప్రభుత్వ పాఠశాలలో అయినా... అకుంఠిత దీక్షతో అనుకున్నది సాధించారు. మండ్ల కవిత... ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు సాధించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపికయ్యారు. ఒక పేద రైతు బిడ్డ సాధించిన ఈ అపురూప విజయం 'నవ్య' పాఠకుల కోసం...

మండ్ల కవిత స్వస్థలం... వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని శానాయపల్లి. ఆమె తండ్రి మండ్ల నాగయ్య. తల్లి పార్వతమ్మ. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కవిత రెండో కూతురు. పెద్ద కూతురు విజయలక్ష్మికి పెళ్లయింది. కుమారుడు సాయితేజ సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. వ్యవసాయమే ఆధారమైనా... పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనుకున్నారు నాగయ్య. పంటపై వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో... వ్యవసాయ పనులతో పాటు జేసీబీ ఆపరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం గ్రామంలోనే పాల వ్యాపారం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో కవిత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 9.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2020లో బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 9.32 సీజీపీఏ సాధించారు.

వారి కష్టానికి ఫలితం: కవిత

"మమ్మల్ని చదివించడానికి మా నాన్న అహర్నిశలూ కష్టపడ్డారు. వ్యవసాయంతోపాటు ఇతర పనులు కూడా చేశారు. ఆ కష్టం వృథా కాకూడదని, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అనుకున్నాను. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు వెళ్లాను. ట్రాన్స్‌కోలో ఏఈగా ఉద్యోగం వచ్చినా... కచ్చితంగా సివిల్స్‌లో ఉద్యోగం సంపాదించాలనే ఉద్దేశంతోనే కోచింగ్‌కు వెళ్లాను. నాకు వచ్చిన మార్కులతో ఏ ఉద్యోగం వచ్చినా చేయడానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు డీఎస్పీగా ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది. నా కోసం అమ్మానాన్నలు పడ్డ కష్టానికి ఫలితం ఈ విజయం."

చిన్ననాటి కల...

2014లో పాఠశాల వార్షికోత్సవంలో కవిత ఉపన్యాసానికి... ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ముగ్ధులయ్యారు. 'పెద్దయ్యాక ఏమవుతావు' అని ఆయన అడిగితే... 'కలెక్టర్ అవుతా' అంటూ ఆమె సమాధానం చెప్పారు. అదే లక్ష్యంతో పట్టుదలగా చదివారు. సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న క్రమంలో టీజీ ట్రాన్స్‌కోలో ఏఈగా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపురం ఏఈగా పని చేశారు. అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. మళ్లీ గ్రూప్ వన్ కోసం ఎనిమిది నెలలు సెలవు పెట్టి తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందారు. చివరకు ఆమె కష్టం ఫలించింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు (బీసీ-ఏ విభాగంలో పదో ర్యాంకు) సాధించారు. డీఎస్పీగా అర్హత పొందారు. తమ కూతురు డీఎస్పీగా ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందంటూ ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



● నోముల రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ పంచమి, శనివారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. త్రిపురాత్రయంలో లలితాదేవి రెండో శక్తి. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ముఖ్యదేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది. లక్ష్మీ సరస్వతులు ఇరువైపులా ఉండి వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్ఠాన శక్తిగా ఆమె కొలువై ఉంటుంది. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించి, శివుడి వక్షస్థలంపై కూర్చుని భక్తులకు వరాలిస్తుందనీ, పంచ, దశాక్షరీ మహా మంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తుల్నీ, ఉపాసకుల్నీ అనుగ్రహిస్తుందనీ భక్తులు నమ్ముతారు. లలితాదేవి విద్యా స్వరూపిణి. సమస్త సుఖాలు ప్రసాదించే శక్తి స్వరూపిణి అనీ, మాంగల్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనీ భక్తుల విశ్వాసం. లలితాదేవి అనుగ్రహం కోసం సువాసినీ పూజ చెయ్యాలనీ, వివిధ పూలతో, కుంకుమతో అర్చించాలనీ పురాణాలు పేర్కొంటున్నాయి. త్రిమూర్తులు, సకల దేవతలు ఆమెను కొలుస్తారనీ, ఆమెను ఆరాధించిన వారికి ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు కలుగుతాయనీ చెబుతున్నాయి.

నైవేద్యం :
అల్లం గారెలు, ఐదురకాల తీపి పదార్థాలు

అలంకరించే చీర రంగు :
బంగారు వర్ణం

అర్చించే పూల రంగు:
వివిధ రకాలు

పారాయణ చెయ్యాల్సినవి:
లలితా సహస్రనామం.




అమ్మవారికి 4.50కోట్లతో అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలోని వాసవీమాతను శుక్రవారం రూ.4కోట్ల 50లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

- అమలాపురం, ఆంధ్రజ్యోతి





బెజవాడలో దసరా సందడి

బెజవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒకవైపు ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు, మరోవైపు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటున్నారు. శుక్రవారం ఐదోరోజు దుర్గమ్మ శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద కృష్ణా నవ హారతిని తిలకించడానికి వచ్చిన భక్తులు జయజయధ్వానాలతో ఆ ప్రాంతాన్ని మార్మోగించారు. బెజవాడలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికలు భక్తులతో కళకళలాడాయి. పున్నమి ఘాట్ వద్ద సాంస్కృతిక సంబరాలు అంబరాన్ని తాకాయి. భవానీ మాలధారుల ప్రత్యేక దాండియా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు.

మైసూరును మరిపిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'

- ప్రశంసించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఉర్రూతలూగించిన బాలీవుడ్ గాయని అభిలిప్సా



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, సుజనాచౌదరి, కేశినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా

విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపదను పండుగలు రక్షిస్తాయని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన సతీమణి రేణుకతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మైసూరు ఉత్సవాలను మరిపించేలా విజయవాడ దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని ప్రశంసించారు. రాజులు కట్టిన ఎన్నో కోటలు కాలగర్భంలో కలిసిపోయాయని, ఆధ్యాత్మిక చింతన పెంచే ఆలయాలు సుస్థిరంగా ఈ నేలపై నిలిచిపోయాయని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటి ఉత్సవాలు ప్రతిబింబిస్తాయని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంచుతాయని అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, బుద్దా వెంకన్న తదితరులు ఘనంగా సత్కరించారు.

ఉప్పొంగిన ఆధ్మాతికత

పున్నమి ఘాట్‌లో ఐదో రోజు శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. బాలీవుడ్ గాయని అభిలిప్సా పాండా తన అద్భుత గాత్రంతో కృష్ణమ్మ ఒడిలో ఆధ్యాత్మికతను ఉప్పొంగించారు. గర్బా నైట్‌లో భాగంగా హిందీ పాటకు దాండియా బృందంతో నాట్యం చేయించారు. స్థానిక కళాకారులు మహిషాసుర సంహారాన్ని నృత్యరూపంలో కళ్లకు కట్టారు.

ఉత్సవ్‌లో నేటి కార్యక్రమాలు

శనివారం సాయంత్రం గొల్లపూడిలో విజయవాడ ఎగ్జిబిషన్‌ను సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారు. తర్వాత సింగర్ సునీల్ లైవ్ మ్యూజిక్ జరుగుతుంది. పున్నమి ఘాట్‌లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, డివోషనల్ లైవ్ కార్యక్రమం ఉంటుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా.. రాజమహేంద్రవరానికి చెందిన నాట్యాచారిణి డాక్టర్ లలిత సిందూరి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరి, మ్యాజిక్ షో, వీరనాట్యం, తోలుబొమ్మలాట, సాంఘిక నాటకం తదితర కార్యక్రమాల ప్రదర్శన జరుగుతాయి. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో.. ఆంధ్రనాట్యం, సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన, బుర్రకథ, తోలుబొమ్మలాట, పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ తులాభారం తదితర కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

దర్శకుడు వైవీఎస్ చౌదరికి మాతృవియోగం



దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి మాతృమూర్తి రత్నకుమారి (88) కన్నుమూశారు. గురువారం రాత్రి ఆవిడ తుది శ్వాస విడిచినట్లు దర్శకుడు చౌదరి తెలిపారు. 'లారీ డ్రైవర్ అయిన మా నాన్న యలమంచిలి నారాయణ రావు సంపాదనతో మా అమ్మ మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. పనిమనిషి ప్రమేయం లేని జీవితాన్ని మాకు అందించాలనే తపనతో ప్రతి రోజూ తెల్లారే లేచి అన్నీ తానే చేసేవారు. మమ్మల్ని పెంచడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. మా అవసరాలకు తగ్గట్లుగా తన నోటి లెక్కలతోనే బడ్జెట్ కేటాయించిన ఆర్థిక రంగ నిపుణురాలు మా అమ్మ. ఆవిడకు తెలిసిన లెక్కలు, మమ్మల్ని పెంచిన విధానం ఏ చదువు, ఏ విద్యా నేర్పించలేనివి. తన విధానాలతో మాలో కూడా స్ఫూర్తిని నింపిన మహనీయురాలు మా అమ్మ' అంటూ నివాళులు అర్పించారు వైవీఎస్ చౌదరి.

సంక్రాంతికి వినోదాల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి మరో కుటుంబ కథా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంక్రాంతికి కానుకగా 2026 జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని యూనిట్ విడుదల చేసింది. బంగారు ఆభరణాల ప్రకటనతో టీజర్ ప్రారంభమౌతుంది. సినిమా ప్రోమోలో భాగంగా ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమాకు బదులు ఆభరణాల గురించి మాట్లాడుతుంది. దాంతో నవీన్ పొలిశెట్టి ఆమె ఆభరణాలను తాను ధరించి 'అనగనగ ఒక రాజు' సినిమా సంక్రాంతికి వస్తోంది అని చెప్పడం సరదాగా ఉంది. టీజర్‌లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటీ పడుతూ నవ్వులు పంచారు. ఈ చిత్రానికి డీవోపీ: జె.యువరాజ్, సంగీత దర్శకుడు: మిక్కీ జె.మేయర్.

మరోసారి భయపెట్టనున్న నవాజుద్దీన్



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్‌దార్ తెరకెక్కించిన రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రం 'థామ్మా'. మడాక్ ఫిల్మ్స్ బేనర్‌పై దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్నారు. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా ఇప్పటికే వచ్చిన 'స్త్రీ', 'ముంజ్యా', 'భేదియా', 'స్త్రీ 2' చిత్రాలు ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు అదే కోవలో 'థామ్మా' వస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా యూనిట్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేసింది. 'యక్షాసన్' అనే భేతాళుడి పాత్రలో నవాజుద్దీన్ సిద్ధిఖీ కట్టి పడేశారు. మరోసారి ప్రేక్షకులను నవాజుద్దీన్ తన భీకర నటనతో భయపెట్టబోతున్నట్లు ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది.

'దృశ్యం 3' సెట్‌లో మోహన్‌లాల్‌కు సత్కారం



ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ పురస్కారం అందుకొన్న మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు శుక్రవారం 'దృశ్యం 3' చిత్రం సెట్‌లో సాదర స్వాగతం లభించింది. ఆ చిత్రంలో మోహన్‌లాల్‌కు భార్యగా నటిస్తున్న మీనా, దర్శకుడు జీతూ జోసెఫ్ అభినందనలు తెలిపి, కేక్ కట్ చేయించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను మీనా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'అవతార్ 3' విడుదలకు సిద్ధం



హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అద్భుత ప్రపంచం 'అవతార్' సంచలన విజయాలు నమోదు చేసిన విషయం విదితమే. హాలీవుడ్ రూపురేఖలనే మార్చేసిన ఈ అవతార్ యూనివర్స్‌లో ఇప్పటికే రెండు భాగాలు విడుదలై ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు నెలల క్రితమే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా మరో కొత్త ట్రైలర్‌ని విడుదల చేసింది. ఇందులో పోరాట ఘట్టాలు కట్టిపడేసేలా ఉన్నాయి. రెండు తెగల మధ్య జరిగిన యుద్ధాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే పండోరాకు చెందిన అద్భుతమైన నీటి అడుగు ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకులకు అందించనుంది.

అమరావతి రైతులకు..

97 ప్లాట్లు కేటాయింపు



ప్లాటు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న స్పెషల్ డీసీ వసంతరాయుడు

తుళ్లూరు సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం(ప్రత్యామ్నాయ) గ్రామాల రైతులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో 97 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 41 నివాస ప్లాట్లు కాగా 36 వాణిజ్య ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. మొత్తం 56 మంది రైతులు, భూ యజమానులకు ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డైరెక్టర్(ల్యాండ్స్) స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (క్యాపిటల్ సిటీ) ఎస్ఎస్‌వీటీ వసంతరాయుడు మాట్లాడుతూ.. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జి.ఐ.ఎస్. సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఏ.జి.చిన్నికృష్ణ, బి. సాయి శ్రీనివాస నాయక్, ఇతర అధికారులు, సీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

29న అమరావతిలో జాబ్ మేళా

తుళ్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా(స్పెషల్ డ్రైవ్) నిర్వహించనున్నారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని సీఆర్డీఏ విజయవాడ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ జాబ్ మేళాలో టీయూవీ ఇండియా, భవ్య హెల్త్ సర్వీసెస్, మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. సివిల్ ఇంజనీర్, అకౌంటెంట్, సూపర్‌వైజర్, ఆఫీస్ అసిస్టెంట్స్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో.. సీఆర్డీఏ సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోంది. టెన్త్, డిగ్రీ(బీకామ్), బీటెక్(సివిల్ ఇంజనీరింగ్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. అర్హత కలిగిన అభ్యర్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు సంప్రదించవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.

23,715 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 19,406 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 23,715 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,387 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14100	334	10500	14400
273	----	----	నెంబరు. 5	10000	14200
341	10000	15000	273	---	----
4884	----	----	341	10000	15200
సూపర్ 10	---	----	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14500	తేజ	10000	14700
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

స్థిరమైన అభివృద్ధి మార్గం..పర్యాటకం

● బాపట్లకు ఆహ్లాదం, ఆదాయం.. సూర్యలంక తీరం ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం





సూర్యలంకలో..పర్యాటకుల సందడి, ఎకో టూరిజం కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం, ఆదాయం, ఆరోగ్యం.. కలగలిపిన అభివృద్ధి మార్గం పర్యాటకం. ప్రకృతిని ఆస్వాదిస్తూ.. కాలుష్యాన్ని కట్టడి చేస్తూ.. ఈ రంగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం. ఐక్యరాజ్య సమితి ప్రయాణం, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక అవగాహన, స్థిరమైన అభివృద్ధిని పర్యాటక సంస్థ ఎలా ప్రోత్సహిస్తుందో హైలెట్ చేస్తుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం అనేది సమాజంలో పర్యాటక పాత్ర గురించి అవగాహన పెంపొందించటానికి అంకితమైన ఒక ప్రధాన అంతర్జాతీయ ఆచారం. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం మన ప్రయాణాలను రాబోయే తరాలకు మరింత బాధ్యతాయుతంగా, స్థిరంగా మార్చాలని గుర్తు చేస్తుంది.

ఏపీలో బీచ్ టూరిజం

ఆంధ్రప్రదేశ్‌లో బీచ్ టూరిజం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు బారువ, కలింగపట్నం, భీమునిపట్నం, రుషికొండ, విశాఖ, గంగవరం, అల్లవరం, మంగినపూడి, సూర్యలంక, ఓడరేవు, కొత్తపట్నం, మైపాడు వంటి ప్రాంతాలు బీచ్ టూరిజానికి ప్రసిద్ధి చెందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆంధ్రా గోవాగా ఖ్యాతి పొందిన బాపట్లలోని సూర్యలంక సముద్ర తీరానికి తెలుగు రాష్ట్రాలు నుంచి పర్యాటకులు విశేష సంఖ్యలో తరలి వస్తున్నారు. అర్ధ చంద్రాకారంలో ఇక్కడి సముద్రపు తీర ప్రాంతం.. స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది. ఇక్కడ పరిసరాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలుగుజేస్తాయి. సూర్యలంక సుందరమనోహర వేదికగా విరాజిల్లుతుంది.

గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్..థీమ్..

ప్రతిసంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు. 2025 థీమ్ పర్యాటకం గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఈ థీమ్ స్థిరమైన పర్యాటక మౌలిక సదుపాయాలు, భూమిని రక్షించడంలో సహాయపడే ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్‌లు పర్యాటక వ్యాపారాలు, ప్రయాణికులను అందరికి మెరుగైన భవిష్యత్తును నిర్మించే ఎంపికలను ఎంచుకోవడాకి ప్రోత్సహిస్తాయి.

ఉపాధి కల్పన..

పర్యాటకం లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా స్థానిక వ్యాపారాలను పెంచుతుంది. విభిన్న నేపథ్యాల ప్రజల మధ్య అవగాహన, గౌరవం, ప్రశంసలను పెంపొందిస్తుంది. బాధ్యతాయుతమైన పర్యాటకం సమాజాలు తమ వారసత్వం, సంప్రదాయాలను కాపాడుకోవటానికి సహాయపడుతుంది.

బీచ్ ఫెస్టివల్ రద్దు..

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజు సూర్యలంక సముద్ర తీరంలో రూ. 97.52 కోట్లు వెచ్చించి అనేక ప్రాజెక్టుల రూప కల్పనకు శ్రీకారం చుట్టాలని భావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా శంకు స్థాపన చేయించాలని చూశారు. అయితే దీనికి ప్రకృతి సహకరించ లేదు. వాతావరణంలో చోటు చేసుకున్న పెనుమార్పులతో కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది.

సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ఇబ్బందులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, చిలకలూరిపేటలో నివసిస్తున్న సగం మంది ప్రజలకు ఈ సమస్య ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 22ఏ(1)సీ గా ఉన్న ఈ సమస్య కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయన్నారు. ఎంతోమంది తమ ఆస్తులను అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో పరిష్కరించకుంటే ప్రజలు తీవ్ర ఆందోళనతో నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యపై వేసిన సబ్ కమిటీ విచారణ ఏ దశలో ఉందో, సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియక ఆందోళన పడుతున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారమైతే ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియచేయవలసిందిగా సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

చెస్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన భారత్

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి చెస్ క్రీడను పరిచయం చేసిన ఘనత భారతదేశం సొంతమని.. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ పోటీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడ వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందన్నారు. ఈ ఆట వినయాన్ని, ఓటమిలో గౌరవాన్ని నేర్పుతుందన్నారు. డాక్టర్ పెమ్మసాని ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాభారతం కాలం నుంచి నేటి వరకూ భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, చారిత్రక వారసత్వం ఉందన్నారు. క్రీడాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తున్నాయన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.40 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,251, 22 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,30,182, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,73,762 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,73,762 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



విద్యుత్ కాంతుల మధ్య విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచింల ప్రాజెక్టులో శుక్రవారం 37.32 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, తొమ్మిది గేట్ల ద్వారా రూ 2,62,998, మొత్తం 2,79,998 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కృష్ణానది వరద ఉధృతి పెరిగే అవకాశం

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం శనివారం కృష్ణా బేసిన్‌లో అతి భారీవర్షం సంభవించే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ భారీవర్షం వల్ల ప్రకాశం బ్యారేజీకి 8 నుంచి 9 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందన్నారు. 2వ ప్రమాద హెచ్చరిక స్థాయి దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో వరద ప్రభావం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, విపత్తుల నిర్వాహణాధికారులతో ప్రజలు సహకరించాలని కోరారు. కంట్రోల్స్ రూమ్స్‌ను ఏర్పాటు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కొల్లూరు మండలంలో 77948 94544, భట్టిప్రోలు మండలంలో.. 81798 86300, రేపల్లె మండలంలో 95053 22959 రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం 08648 293795ను అత్యవసర సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2,39,161 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,30, 325, తూర్పు డెల్టా కాల్వకు 4323, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

అనుమానాస్పద మృతి..

నరసరావుపేట లీగల్, సెప్టెంబర్ 26 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని ఇసప్పాలెం గ్రామ పరిధి లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఇస్సపాలెం నుంచి జొన్నలగడ్డ వైపు వెళ్లే రోడ్డులోని నీటి కుంటలో ఓ వ్యక్తి శవం ఉందన్నారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, మృతదేహం కుడి ఎడమ చాతిపై పచ్చ బొట్టు ఉన్నట్టు తెలిపారు. గుర్తుపట్టినవారు నరసరావుపేట రూరల్ ఎస్సై సెల్ నెంబర్ 94407 96244కు సమాచారం తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుర్గి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైకును ఎదురుగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అడిగొప్పుల వద్ద శుక్రవారం జరిగింది. రాజుపాలెం మండలం దేవరపాడుకు చెందిన చప్పిడి రాము (35) మాచర్ల పట్టణంలోని వివాహ వేడుకకు హాజరై.. పెళ్లికుమార్తె స్వగ్రామమైన మండలంలోని అడిగొప్పులకు బయలుదేరాడు. అడిగొప్పుల కుడి కాలువ వద్ద మాచర్ల వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం బైకును ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన రామును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్లలో విజిలెన్స్ విచారణ

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని ఓ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే అధికారులు మాత్రం దీనిని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఒక అధికారితో ఏకాంతంగా మాట్లాడి కొన్ని పత్రాలు అడిగినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఎందుకొచ్చారో ఏమిటో అంటూ చర్చించుకుంటున్నారు. అయితే వివరాలు మాత్రం బయట పెట్టలేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

పారిశ్రామిక ప్రగతికి..

బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

వినుకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపద సృష్టి, పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు పోలికే లేదని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. శాసనసభలో పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన అభివృద్ధి, 2019-24 మధ్య జగన్ చేసిన అరాచకాలే అందుకు నిదర్శనమన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మిస్తే 30 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. కానీ, దోపిడీ వేధింపుల తప్ప మరేం పట్టని జగన్ రాష్ట్రంలో ఉన్న అమర్‌రాజా, లూలూ వంటి సంస్థల్ని తరిమేసి.. ఉన్న ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. అందుకే ప్రజలంతా చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్ అనుకుంటూ ఉంటే.. జగన్‌ను దోపిడీ, పరిశ్రమలను వెళ్లగొట్టడానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చూస్తారని చురకలు వేశారు. లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి ఏపీ అత్యుత్తమ స్థానంలో నిలవనుందన్నారు.

హిందూపూర్ వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని హిందూపూర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. నవంబరు 20 నుంచి 26వ తేదీ వరకు 17215 మచిలీపట్నం - హిందూపూర్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రయాణిస్తుంది. ఈ రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు ఉదయం 9.50 గంటలకు చేరుకొని 10 గంటలకు బయలుదేరి 10.25కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, మధ్యాహ్నం 12.15కి హిందూపూర్ చేరుకుంటుంది. 17216 హిందూపూర్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ నవంబరు 21వ తేదీ నుంచి 27 మధ్యన హిందూపురంలో మధ్యాహ్నం 3.30కి బయలుదేరి సాయంత్రం 4.18కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, 5.20కి ధర్మవరం చేరుకొని మచిలీపట్నంకు బయలుదేరుతుంది.

హైటెక్ సిటీ, చర్లపల్లిలో..

రైళ్ల తాత్కాలిక నిలుపుదల

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసర పండగ సెలవుల రద్దీ దృష్ట్యా నరసపూర్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లకు హైటెక్ సిటీ, చర్లపల్లి రైల్వేస్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని రైల్వే శాఖ కల్పించింది. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు హైటెక్ సిటీకి సాయంత్రం 6.48కి చేరుకొని 6.49కి బయలుదేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో ఉదయం 6.20కి హైటెక్ సిటీకి చేరుకొంటుంది. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లికి వేకువజామున 3.44 గంటలకు, హైటెక్ సిటీకి 4.44కి చేరుతుంది. 17256 లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ హైటెక్ సిటీకి రాత్రి 9.05కి, చర్లపల్లికి 10.09కి చేరుతుంది.

ఉత్తమ శాస్త్రవేత్తలుగా

ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లు..

● స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ సర్వేలో స్థానం



ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపికైన ప్రొఫెసర్లతో వీసీ డాక్టర్ సతీష్ కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఏడుగురు ప్రొఫెసర్లకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. అమెరికాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ఈ ఏడాది జరిపిన ప్రత్యేక సర్వేలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2 శాతం ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో వీరికి చోటు దక్కినట్లు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ శుక్రవారం పేర్కొంది. పరిశోధనల పరంగా ప్రపంచ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లను తన సర్వే ద్వారా స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ఎంపిక చేస్తోందని వెల్లడించింది. ఈ ఏడాది ఎస్ఆర్ఎంకి చెందిన ఏడుగురు ప్రొఫెసర్లను ఎంపిక చేసిందని పేర్కొంది. రీసెర్చ్ వర్క్, పబ్లికేషన్స్ సైటేషన్స్, టాప్ ర్యాంకింగ్ జర్నల్స్‌లో ముద్రతమైన పరిశోధనా వ్యాసాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులు కేటాయిస్తుందని తెలిపింది. వర్సిటీకి చెందిన డాక్టర్ రంగభాష్యం సెల్వంసెంబియన్, డాక్టర్ రణధీర్ కుమార్, డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్, డాక్టర్ క్షీరసాగర్ సాహు, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ ప్రభుజిత మహాపాత్ర, డాక్టర్ సింటూ భూనియాలు ఎంపికైనట్లు తెలిపింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్ఎర్ఎం యూనివర్శిటీలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఏడుగురు శాస్త్రత్తవేత్తలను సత్కరించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, అకుంఠిత దీక్ష పట్టుదలతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవవడం యూనివర్శిటీకి గర్వకారణంగా ఉందన్నారు. రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత ధాపా మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి ఈ తరహా గుర్తింపు పొందే.. శాస్త్రవేత్తలు వర్శిటీ ఉంచి 15 మందికి పైగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎంపికైన నలుగురు ప్రొఫెసర్లకు వర్శిటీ తరపున రూ.50వేల నగదు పారితోషకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ డీన్లు డాక్టర్ టామి, వషణనాద్, రమణరావుతో పాటు హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల ప్రొఫెసర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, డైరెక్టర్లు పంకజ్, శివరంగన్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలు పూర్తిచేయాలి

● జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ వి.సోములనాయక్

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వి.సోములనాయక్ తెలిపారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సోములనాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ పరీక్షలు పెంచాలన్నారు. ప్రతి పేషెంట్‌కు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా మందులివ్వాలని చెప్పారు. గర్భిణీలకు 32-36 మధ్య వైరల్‌లోడ్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డాక్టర్ సాదిక్, జానీబాషా, చైతన్య, కిరణ్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు


మాట్లాడుతున్న సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మీ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు రసూల్‌పేట అంగన్‌వాడీ సెంటర్‌లో 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం చందోలు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ బొలగాని జ్యోతిలక్ష్మీ ఆధ్వర్యంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పురుషుల భాగస్వామ్యం, పౌష్టికాహార విలువలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిరాజుతోటలో వైద్య శిబిరం


నందిరాజుతోట సచివాలయం వద్ద క్లాప్ మిత్రాలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బాపట్లరూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల గ్రామపంచాయతీలోని నందిరాజుతోటలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం అప్పికట్ల పీహెచ్‌సీ డాక్టర్ షేక్ ఉస్మాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో జి.రామకృష్ణ వైద్యశిబిరాన్ని సందర్శించి క్లాప్‌మిత్రలకు వైద్య పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్ పల్నాటి శ్రీరాములు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రాపలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్

కొల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం మండలంలోని క్రాప ప్రాథమిక పాఠశాలలో కొల్లూరు సీహెచ్‌సీ వైద్యురాలు వి.కావ్య మహిళలు, పురుషులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబ భవిష్యత్తు బాగుంటుందని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. శిబిరంలో రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

వీఏఏలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ


పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న సహాయ గణాంక అధికారి కొండలరావు

అమృతలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరిపొలాల్లో పంట కోత ప్రయోగాలపై వీఏఏలకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి కొండలరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నలుగురు రైతుల పొలాలను ర్యాండమ్‌గా ఎంపిక చేసి ఆ పొలాలను సందర్శించి చుట్టుపక్కల పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో హేమంత్‌భరత్‌కుమార్, ఏఈవోలు మాధవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


జ్యోతి నారాయణరావు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంచాళవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు జ్యోతి నారాయణరావు(70) అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. ఎమ్మెల్యే మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, సర్పంచ్ పావులూరి హేమచంద్, లాం హరినాథ్, గవిని వెంకటేశ్వరరావు, పాములపాటి వెంకటసుబ్బారావు, మ్యాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు సంయమనం పాటించాలి : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, కొన్ని పెద్దసినిమాలకు టిక్కెట్లు ధరల పెంపు గురించి అప్పటి సీఎం జగన్‌కు వివరించి సానుకూల ఫలితాలు పొందేందుకు చిరంజీవి నాయకత్వంలో కొందరు సినీప్రముఖులు వెళ్ళినప్పుడు జగన్ ప్రదర్శించిన హావభావాలు అవమానకరంగా ఉన్నాయని నేటి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆనాడే బాధను వ్యక్తం చేశారని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి పేర్కొన్నారు. హీరో బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలతో ఆగ్రహీరో చిరంజీవని రెచ్చగొట్టి దావానంలా సృష్టించి కూటమి ప్రభుత్వ ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి కుట్రలు చేస్తున్నారన్నారు. కావున కూటమి నేతలు సంయమనం పాటించాలని కొల్లా శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

ఉచిత వైద్యశిబిరం

చెరుకుపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న బాపట్ల యజ్ఞ హాస్పిటల్‌చే చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి హైస్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు డాక్టర్ యజ్ఞశ్రీకాంత్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరుగుతుందన్నారు. గుండె, ఎముకలు, సంధివాతం, మహిళల ఆరోగ్యం, సాధారణ వ్యాధులకు ఉచిత పరీక్షలు, మందులు ఇస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ నెంబర్ ఫీడర్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ స్కీంనందు అభివృద్ధిపనుల నేపథ్యంలో శనివారం రాజేష్‌థియేటర్ ఏరియా, పల్స్ హాస్పటల్, రింగ్‌రోడ్డు, ఎంసీఏ హాలు పరిధిలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు.

ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నోటిఫికేషన్ విడుదల


రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రేపల్లె తాలూకా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు రేపల్లె తాలూకా కె.అంకమ్మరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాలూకా యూనిట్‌లో మొత్తం 13 పదవులకు నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. అధ్యక్షులు, సహాయ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారులకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

రేపు మోదుకూరులో బుద్ధుని జీవిత చరిత్ర నృత్యరూపకం

చుండూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా గౌతమ బుద్ధుని జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన కూచిపూడి నృత్య రూపకం ఆదివారం మోదుకూరులోని శ్రీవేమన సాహిత్య వికాస భవనంలో నిర్వహిస్తున్నట్లు గ్రంథకర్త తియ్యగూర సీతారామిరెడ్డి శుక్రవారం తెలిపారు. శాంత బయోటెక్ అధినేత వరప్రసాదరెడ్డి, లతారాజా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.కె.రాజా, ఎన్‌ఆర్‌ఐ ఉప్పల నాగిరెడ్డి, బెంగళూరుకు చెందిన పమిడిముక్కల పాండురంగారావు తదితరులు తోడ్పాటుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చదలవాడ ఆనంద్, కుమార సూర్యనారాయణ తదితరుల రూపకల్పనలో ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు.

కనులవిందుగా అమ్మవారి అలంకారాలు


పిట్టలవానిపాలెం: శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు


బాపట్ల: ప్రత్యేక అలంకరణలో జిల్లెళ్ళమూడి మాతృశ్రీ అనుసూయ మహాదేవి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో శ్రీపార్వతి అమ్మవారు శ్రీగజలక్ష్మీదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఖాజీపాలెం శ్రీకాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో శ్రీఅన్నపూర్ణాదేవి భక్తులచే పూజలు అందుకున్నారు. చందోలు శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 29వ తేదీన మూలనక్షత్రం సందర్భంగా శ్రీసరస్వతీమహాదేవి పూజా కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తామని త్రిముఖ దేవాలయాల కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

● బాపట్లరూరల్: బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో మాతృశ్రీ అనసూయమహాదేవి అమ్మవారు లలిత త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న చండీహోమంలో భక్తులు పాల్గొనవచ్చని శ్రీవిశ్వజననీ పరిషత్ ట్రస్ట్ కోశాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.

● అమృతలూరు: శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు.

● రేపల్లె: దసరా మహోత్సవం ఐదో రోజు నియోజకవర్గంలో ఘనంగా శ్రీదేవీ శరన్నవరాత్రులు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో లక్ష్మీదేవి, గజలక్ష్మీ అమ్మవారిగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చింది పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, రైలుపేట అభయాంజనేయస్వామిఆలయం, శారదాపీఠం, రెల్లికాలనీ, 3వవార్డు రామమందిరం వద్ద దేవీశరన్నవరాత్రిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిల్లీ పబ్లిక్‌స్కూల్లో దుర్గాదేవికి పాఠశాల అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది ప్రసాదరావు దంపతులు పూజలు నిర్వహించారు.


బాపట్ల: కర్లపాలెం పెద్దింటమ్మ తల్లి ఆలయంలో లక్ష్మీదేవి అవతారం


రేపల్లె: కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లక్ష్మీదేవిగా దుర్గమ్మ

● వేమూరు: జంపని రామేశ్వరాలయంలో బాలత్రిపురసుందరిగా, చావలి గోగులమ్మ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. చావలి వాలేశ్వరాలయంలో మహాలక్ష్మీగా, అబ్బనగూడవల్లి శివాలయంలో మహాలక్ష్మీగా అలంకరించారు.

● చుండూరు: వలివేరులోని శ్రీలలిత స్వయంభువేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చినపరిమిలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మోదుకూరు శ్రీకనకదుర్గమ్మ ఆలయం, చుండూరు, యడ్లపల్లి, వేటపాలెంలోని శివాలయాల్లో అమ్మవారు భక్తులకు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు.

● బాపట్ల: పట్టణంలోని సూర్యలంకరోడ్డులో శ్రీలలితాత్రిపురసుందరి పీఠం, ముత్తాయపాలెం శక్తి దేవస్థానంలో అమ్మవార్లు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● కొల్లూరు, భట్టిప్రోలు: కొల్లూరులోని పార్వతీ అమ్మవారి దేవస్థానంలో ధనలక్ష్మీదేవి, మండలంలోని సోమశేఖరస్వామి దేవస్థానంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు మహాలక్ష్మి అలంకారం, భట్టిప్రోలులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా, పార్వతీ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

● చెరుకుపల్లి: చెరుకుపల్లిలోఅమ్మవారు ధనలక్ష్మీదేవిగాదర్శనమిచ్చారు.

● కర్లపాలెం: పాతనందాయపాలెంలో శ్రీపోలేరమ్మఅమ్మవారి ఆలయ ప్రాంగణంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో పూజలందుకున్నారు. కర్లపాలెం సెంటర్‌లోని శ్రీకాళికమ్మతల్లి, వీరభద్రస్వామి దేవాలయంలో లక్ష్మీదేవి అవతారం, పెద్దింటమ్మ తల్లి ఆలయంలో లక్ష్మీదేవి అవతారం, ఆదిశేషు పీఠంలో మహాలక్ష్మీదేవి అవతారం, కర్లపాలెం- బాపట్ల రోడ్డులోని ఆదిశేషు యోగ శక్తిపీఠంలో మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.


చుండూరు: వలివేరులో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు


వేమూరు: జంపని రామేశ్వరాలయంలో బాలత్రిపురసుందరి అలంకారం


పిట్టలవానిపాలెం: ప్రత్యేక అలంకరణలో ఖాజీపాలెం శ్రీకాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలోని శ్రీఅన్నపూర్ణాదేవి


బాపట్ల: శ్రీమహాలక్ష్మీదేవిగా శ్రీలలితా త్రిపురసుందరిదేవి అమ్మవారు


కొల్లూరు: మహాలక్ష్మి అలంకారంలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు


బాపట్ల: పాతనందాయపాలెంలోని శ్రీపోలేరమ్మఅమ్మవారి ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారు

జిల్లా మహాసభలను విజయవంతం చెయ్యాలి


మహాసభలను జయప్రదం చెయ్యాలంటూ ఆటో కార్మికులను కోరుతున్న సీఐటీయూ నాయకుడు మణిలాల్

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రేపల్లెలో శనివారం జరిగే సీఐటీయూ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చెయ్యాలని బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగసభకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని కూలీలు, కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ, మున్సిపల్, ఆర్టీసీ, తదితర ప్రభుత్వ, ప్రైవేటురంగ కార్మికుల సమస్యలపై భవిష్యత్తు పోరాటాలను నిర్ధేశించుకోవటం, రైతాంగ పోరాటాలపై ప్రస్తావించటం జరుగుతుందన్నారు. 27, 28తేదీల్లో పట్టణంలో జరుగుతున్న మహాసభలను విజయవంతం చెయ్యాలని కోరారు.

● వేమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా సీఐటీయూ రెండో మహాసభలు ఈ నెల 27, 28 తేదీలలో రేపల్లెలో నిర్వహిస్తారని వాటిని కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి అగస్టీన్ కోరారు. శుక్రవారం ఆయన మండల గ్రామాల్లోని కార్మికులు, ముఠా కార్మికులను, అంగన్‌వాడీలు, ఆశలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 27వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుంటే కార్యాలయం ముట్టడి

● సీఐటీయూ నాయకుడు కె.శరత్


బాపట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీవాసులు

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వసతులు లేని కాలనీలో నివాసం ఉంటున్న ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ నాయకులు కె.శరత్ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీవాసులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. 1800కు పైగా ఇళ్ళపట్టాలిచ్చారని, 1000 కుటుంబాల వరకు అక్కడ నివాసం ఉంటున్నారన్నారు. తాగునీరు, సరైన రోడ్లు, వీధిదీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాల్లో స్థలాలిచ్చి ఇల్లు కట్టుకోమని ఒత్తిడి తెచ్చి మరీ కట్టించారని ఇప్పుడు వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విషపురుగుల భయం, దోమలవ్యాప్తితో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ చుట్టూ నిలిచిన నీటిని బయటకు పంపించాలని, ఇళ్ళకు డోర్‌నెంబర్లు ఇవ్వాలని, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేసి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేష్, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మీ, సల్మా, నాని, లోకేష్, కార్తీక్, మునికుమారి, పద్మావతి, నర్రా రాంబాబు, సురేష్, లలితకుమారి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లకు ఆలస్య రుసుంతో గడువు పెంపు

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్ కింద ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ కోర్సుల అడ్మిషన్ షెడ్యూల్‌ను 200 రూపాయల ఆలస్య రుసుంతో అక్టోబరు నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో ఎస్.పురుషోత్తం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున తగిన సమయంలో ప్రతిపాదనలు సమర్పించాలని ఓపెన్ స్కూల్ సొసైటీ కింద నడుపుతున్న స్కూల్స్‌వారిని కోరారు.

దోమలనివారణకు ఫాగింగ్


దోమనివారణకు ఫాగింగ్‌చేస్తున్న దృశ్యం

కర్లపాలెం సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దోమల నివారణకు పారిశుధ్యకార్మికులు ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆశా చక్రవర్తి, కార్యదర్శి షాహి మా, టీడీపీ నాయకులు, జనసేనపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

జీఎస్టీ తగ్గింపుపై ప్రతి కుటుంబానికి తెలియజేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని.. ఇంటింటికెళ్ళి జీఎస్టీ తగ్గింపుపై ప్రతి కుటుంబానికి తెలియజేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై సంబంధితాధికారులతో కలెక్టర్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అక్టోబరు 19వ తేదీ వరకు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జీఎస్‌టీ 2.0 కింద ప్రజలకు కలిగే లబ్ధిపై అవగాహన కార్యక్రమాలు 4 వారాలపాటు నిర్వహించాలన్నారు. జీఎస్‌టీ అధికారులతో మిగిలిన శాఖాధికారులు కలిసి పనిచేయాలన్నారు. ప్రతి వారం ఒకథీమ్ తీసుకొని అవగాహన కల్పించాలన్నారు. మొదటివారం నిత్యావసరాల ధరల పొదుపు, రెండో వారం వ్యవసాయ అనుబంధ రంగాల వస్తువులు, మూడో వారం విద్య, జీవితబీమా, ఎలక్ట్రానిక్స్, ఎంప్లాయిమెంట్‌పై అవగాహన, నాల్గవవారం పర్యాటక, మందులు, రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో ఛైర్మన్‌గా ఉంటారని మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్, మండలస్థాయిలో ఎంపీడీవోలు, సచివాలయ పరిధిలో కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారని తెలిపారు.

వసతి గృహ విద్యార్థుల నైపుణ్యం మెరుగుపర్చాలి

సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖాధికారులు, విద్యాశాఖాధికారులు, వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలోని విద్యార్థులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు పోటీపరీక్షలకు నైపుణ్యాన్ని పెంచేలా శిక్షణా తరగతులు ఇవ్వాలన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ వసతిగృహాలలో జర్మన్ లాంగ్వేజ్ కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని హాస్టళ్ళ మరమ్మతులు వేగవంతం చేయాలన్నారు. సీజనల్‌వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నూరుశాతం ఇంటింటి నుండి చెత్త సేకరించాలి

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్త సేకరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 461 గ్రామపంచాయతీలలో మురికికూపాలుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని తెలిపారు. అక్టోబరు 2వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా సమావేశాల్లో జీఎస్‌టీ కమిషనర్ మురళీకృష్ణ, సీపీవో ఏఎస్‌రాజు, డీపీవో ప్రభాకరరావు, డీఎల్‌డీవో విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జె.రాజాదెబోరా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ అనంతరాజు, ఎంఈవో డి.ప్రసాదరావు, ఈడబ్ల్యు ఐడీసీ అధికారి భాస్కర్‌బాబు, డీపీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వేదిక


● ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి 40 అర్జీలు



ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందని, వారి ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 40 ఫిర్యాదులు అందాయన్నారు. పెన్షన్‌లు, రహదారులు, రేషన్ కార్డులు, గృహాల కోసం దరఖాస్తులు అందాయని, వాటిని పరిశీలించి ఆయా కార్యాలయాలకు పంపి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి


దాడిలో గాయపడి స్పృహ కోల్పోయిన గోపాలం

కొల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థల వివాదం కారణంగా ఓ వ్యక్తిపై మరో వ్యక్తి, ఓ మహిళ దాడి చేయడంతో గాయపడి స్పృహ కోల్పోయిన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన గరిక గోపాలం, గరిక నాంచారయ్య మధ్య గత కొంతకాలంగా బాట విషయంలో వివాదం ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రేపల్లె-తెనాలి ప్రధాన రహదారిపై నాంచారయ్య, మల్లేశ్వరిలు గోపాలంను తరిమితరిమి స్పృహ కోల్పోయే వరకు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని 108లో చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ అమరవర్ధన్ తెలిపారు.

నానో ఎరువులపై అవగాహన

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటపై రెండు, మూడు దఫాల్లో నానో యూరియా, డీఏపీలు వాడాలని ఏవో మహేష్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని రాజుకాల్వ గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈవో సతీష్ పాల్గొన్నారు.


రాజుకాల్వ గ్రామంలో రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న ఏవో మహేష్‌బాబు

అవీ..ఇవీ..

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

బల్లికురవ, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన మసాని వెంకటమల్లికార్జునరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు బల్లికురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో నమోదయ్యారు. ఈ పథకం ద్వారా మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు మంజురయింది. శుక్రవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ శీనానాయక్ మృతుడు నామిని అయిన మసాని రామసుబ్బయ్యకు చెక్కును అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు బిందు మాధవి, సుహిత గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం

● ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకున్న అనూష

బల్లికురవ, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి): కూలి నాలి చేసుకుని జీవనం సాగించే నిరుపేద ఎస్సీ కుటుంబంలో డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టు రావడంతో అ కుటుంబ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. మండలంలోని కొప్పెరపాడు ఎస్సీ కాలనీకి చెందిన దమ్ము గంగయ్య గ్రామంలో టైర్లు పంక్చర్ వేసుకుని జీవనం సాగిస్తు న్నాడు. ఆయన భార్య శ్రీరంజని రోజు వారి కూలి పనులకు వెళుతోంది. వీరి పెద్ద కుమార్తె అయిన అనూష చిన్న తనం నుంచి చదువులో చురుగ్గా ఉండేది. అనూష టీటీసీ ఉర్దూ పూర్తి చేసింది. కృష్ణా జిల్లా కోటా కింద ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచి పోస్టును సొంతం చేసుకన్నారు. తన తల్లిదండ్రులు తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి ఉపాధ్యాయ పోస్టు సాధించిన అనూషను పలువురు అభినందించారు. ప్రభుత్వం గురువారం ఉపాధ్యాయ నియామక పత్రాలను అందజేయగా అనూష మరో మారు తన తల్లిదండ్రుల చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకుని ఆనందాన్ని పంచుకున్నారు.


నియామక పత్రంతో అనూష





మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

● పలుచోట్ల నగదుతో విశేషంగా అలంకరణ ● అద్దంకిలో వాసవీమాతకు కుంకుమ పూజలు

మేదరమెట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలల్లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మేదరమెట్లలోని మిద్దెలడొంకలో దుర్గమాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పెద్దసంఖ్యలో నోట్లదండలతో అలంకరించారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వరాలయంలో ఉమామహేశ్వర అమ్మవారిని మహలక్ష్మీదేవిగా ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావినూతల పమిడిపాడు, కొరిశపాడు, ప్రాసంగులపాడు గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవ రాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అద్దంకి : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దత్తపాదుకా క్షేత్రం, వేయి స్థంభాల గుడిలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

పంగులూరు : మండలంలో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాలలో శ్రీమహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీగణపతి షిరిడిసాయి ఆలయంలో గణపతి పూజ, నవావర్ణపూజ, కలశ స్థాపన చేసి స్వామివారికి అభి షేకాలు హోమాలు నిర్వహిం చారు. సాయంత్రం శ్రీచక్రార్చనలు, శ్రీమహాలక్ష్మీ పూజ, శ్రీలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన పూజాకార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి దివ్యరూపాచారి శాస్త్రోక్తంగా నిర్వహించారు. రేణంగివరంలోని త్రిశక్తిపీఠంలో అమ్మ వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కొండమూరు లోని కొండమూరమ్మ అమ్మవారి ఆలయప్రాంగణంతో పాటు పంగులూరులోని రాయిణివారి వంశదేవర రేణుకమ్మ అమ్మవారి ఆలయం, రామకూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించారు. చందలూరు, పంగులూరు పరిసర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మార్టూరు : మహాలక్ష్మీదేవి అవతారంలో శుక్రవారం మండలంలోని అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా ఐదవరోజు శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవి అలంకరణ చేసి భక్తులు పూజలు చేశారు. మార్టూరులో దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో అర్చకులు సురేష్ అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా రుక్మాబాయి శ్రీపాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవి అవతారంలో, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీలలితా త్రిపురసుందరీదేవి అవతారంలో అర్చకులు ప్రత్యేక అలంకరించారు. భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాగరాజుపల్లి గ్రామంలో శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారిని రూ.2 లక్షల నగదుతో అలంకరించారు. ద్రోణాదులలో మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. .

చినగంజాం : స్థానిక భూ సమేత భావనారాయణస్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని గరుడోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి కోలాటబృందం సభ్యులు వేసిన కోలాటం భక్తులను ఆకట్టుకొంది.


అద్దంకి, మార్టూరు, ముప్పవరంలో అమ్మవారి అలంకరణలు


త్రిశక్తి పీఠం, నాగరాజుపల్లెలో మహాలక్ష్మి అలంకరణ

భారీ వర్షాలకు దెబ్బతిన్న నేల చప్టా, రోడ్డు

కొణిదెన- గంగపాలెం గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

బల్లికురవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొణిదెన- గంగపాలెం మధ్య రహదారి, వంతెన పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవల భారీ వర్షాలు కురవటంతో పెద్దఎత్తున వర్షపు నీరు రోడ్డుపై నిలిచింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. మండలం లోని కొణిదెన ఉప్పుమాగులూరు పంచాయతీ రాజ్ బీటీ రోడ్డులో గంగపాలెం సమీపంలో ఉన్న నేల చప్టా పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. ఈ చప్టాలో ఉన్న గోతులలో నీరు నిలబడడంతో శుక్రవారం రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పెద్ద వాహనాలు ఈ రోడ్డులో వచ్చే వీలులేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం గ్రానైట్ ముడిరాయి లారీలు తిరిగే రోడ్డులో రాకపోకలు లేక పోవడంతో పరిశ్రమలకు రాళ్ల రవాణా నిలిచి పోయింది. ద్విచక్ర వాహనాల వారు మాత్రం చప్టా అంచులో ఉన్న కొద్ది పాటి రోడ్డులో భయం భయంతో ప్రయాణం సాగిస్తున్నా రు. ఈ రోడ్డు అధ్వాన స్థితికి చేరిం దని కొణిదెన గ్రామం నుండి ఉప్పు మాగులూరు వరకు రోడ్డులో మోకాటి లోతు గోతులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డుకు నిధులు మంజురు చేసి నేల చప్టా ఎత్తుపెంచి రోడ్డును అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.


భారీ వర్షాలకు నేలచప్టాపై నిలిచిన నీరు


గోతులమయంగా ఉన్న రహదారి

మత్తుపదార్థాల నియంత్రణకు కృషి

బీజేపీ, ఇండియన్ రెడ్‌క్రాస్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

చీరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలు కోల్పోతున్నారని బీజేపీ, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం పట్టణంలో 'సేవా పక్వాడా నషా ముక్త్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో

● వ్యక్తి మృతి.. మరొకరికి గాయాలు

మార్టూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును ట్రాలీ ఆటో ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై మార్టూరు లోని హీరోషోరూం సమీపంలో శుక్రవారం వేకువజామున చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్ఐ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి టెంట్ సామన్లతో వస్తున్న ట్రాలీ వాహనం క్రాస్ చేస్తోంది. ఈ క్రమంలో ట్రాలీ ఆటోవాహనం బస్సు వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటోలో క్యాబిన్‌పై కూర్చున్న రాయపాటి ప్రకాష్ (37) అనే వ్యక్తి తలకు తీవ్రగాయమైంది. దీంతో ఈ ఘటన స్థలంలోనే మృతిచెందారు. ఆయన పక్కనే కూర్చున్న మరో వ్యక్తి రంపతోటి అశోక్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవరు వలి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారు టెంట్ సామానుతో తెనాలి, దుగ్గిరాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో మృతిచెందిన ప్రకాష్ అనే వ్యక్తి స్వగ్రామం త్రోవగుంట. ఆయనకు భార్య ప్రియాంక, ఇద్దరు కుమారులున్నారు. మృతుని భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.


ప్రమాదానికి కారణమైన ట్రాలీ వాహనం

ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావు అరెస్టు

● సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంపై చర్యలు

మార్టూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఎం నారాచంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు సీఐ శేషగిరిరావు వివరాలను వెల్లడించారు. సర్పంచ్ భాగ్యారావు అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి, వాటిని కొన్ని వాట్సాప్ గ్రూపులకు పంపించారు. దీంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, గద్దె అశోక్ మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ద్రోణాదుల గ్రామంలోని కమ్యూనిటీ భవనం వద్ద భాగ్యారావును సీఐ ఎం.శేషగిరిరావు అదుపులోకి తీసుకొన్నారు. .అనంతరం విచారణ నిమిత్తం భాగ్యరావును బాపట్లలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మామహేశ్వర్ ముందు ప్రవేశ పెట్టారు.

ఆదాయ మార్గాల పెంపుపై అవగాహన

ఇంకొల్లు, సెప్టెంబరు 26,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూపై పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయితీలు వివిధ పన్నుల ద్వారా రెవెన్యూ సోర్స్ పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవోటీలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం

కొత్తపేట(చీరాల), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల వినియోగంతో చక్కని ఆరోగ్యం లభిస్తుందని వేటపాలెం మెడికల్ అధికారి డా.స్వాతికిరణ్ చెప్పారు. శుక్రవారం కొత్తపేట సచివాలయం-1లో 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో ఊబకాయం, చక్కెర వ్యాధులపై అవగాహన కల్పించారు. బాల్యరక్షణపై ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి, ఐటీసీ ఫినిష్ సొసైటీ ప్రతినిధి మంజూష, ప్రశాంతి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్‌లకు భారతరత్న ప్రకటించాలి

చినగంజాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలుగు తేజాలకు ఎన్టీఆర్, ఏఎన్నార్, ఘంటసాలలకు భారతరత్న అవార్డు ప్రకటించాలని నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమ రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడవకుదురు గ్రామంలోని ప్రజాచైతన్య కళావేదిక కార్యాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళాయాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజా చైతన్య కళావేదిక అధ్యక్షులు ఆరిగ వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నవ్యాంధ్ర సాంస్కృతిక కళాయాత్రగోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య కళావేదిక సభ్యులు పల్లపోలు నాగ మనోహరలోహియా, సుంకర కోటేశ్వరరావు, ముసలారెడ్డి, ధైవాల తిరుపతిరెడ్డి, మెలిక గోపాల్, ఏడుకొండలు, శ్రీనివాసరావు, వర్ధమాన సినీనటులు బి.కళిదాసులు పాల్గొన్నారు.

నేడు చినగంజాంలో రెవెన్యూ గ్రామసభ

చినగంజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చినగంజాం రెవెన్యూ పరిధిలో జరగనున్న మూడో విడత భూముల రీసర్వేపై శనివారం ఉదయం 10గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పల్లెపాలెం గ్రామాల్లోని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లోని భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు, భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు, చినగంజాం రెవెన్యూ గ్రామ రైతులందరూ తప్పక హాజరు కావాలని తహసీల్దార్ తెలిపారు.

వృత్తి శిక్షణతో ఉపాధికి అవకాశం : హెచ్‌ఎం

● విద్యార్థులకు స్వయం ఉపాధిపై ఇంటర్న్‌షిప్

పంగులూరు,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులలో వృత్తిశిక్షణ నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా స్వయం ఉపాధి అకాశాలు మెరుగుపడతాయని హెచ్‌ఎం అనిత అన్నారు. మండలంలోని కొండమంజులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పంగులూరులో నిర్వహిస్తున్న ఒకేషనల్ ఇన్‌టర్న్‌షిప్ కార్యక్రమాన్ని శుక్రవారం హెచ్‌ఎం అనిత పర్యవేక్షించారు. పాఠశాల విద్యార్థులకు ఆటోమోటివ్‌ట్రేడ్‌కు సంబంధించి జి.రవీంద్ర, రిటైల్‌ట్రేడ్‌కు సంబంధించి సీహెచ్ గంగాభవానీప్రసాద్‌లు శిక్షణయిస్తున్నారు. ఆటోమోటివ్‌ట్రేడ్‌లో భాగంగా పంగులూరులోని ఎస్ఏఆర్ ఆటోమొబైల్స్‌లో ద్విచక్రవాహనాల పరికరాలు, రిపేర్ల గురించి అవగాహన కల్పించారు. రిటైల్‌ట్రేడ్‌కు సంబంధించి జీఎస్‌ఆర్, నాగమ్మ. జనరల్‌స్టోర్స్, రాజారావు టెక్స్‌టైల్స్‌నందు ప్రోడక్ట్ లేబులింగ్, వ్యాపారవిధానం, వినియోగదారులతో మెలిగేపద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఇన్‌టర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు మెరుగుపడతాయని, వృత్తిసంబంధమైన వ్యాపారాలలో పదవ తరగతిలో పరీక్షలు రాయడంద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందుతారని హెచ్‌ఎం అన్నారు.

కుందేరు అభివృద్ధికి సహకరించండి

● అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కొండయ్య

● కుందేరు అభివృద్ధితో ఎంఎస్‌ఎంఈ పార్కు, నివేశన స్థలాల కల్పన

చీరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల కుందేరు అభివృద్ధిపై ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. ప్రస్తుతం ఆక్రమణలు, జంతు కళేబరాలతో నిండి అస్థవ్యస్థంగా ఉందని అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. విపత్కర సమయాల్లో చీరాల, పర్చూరు నియోజక వర్గాల్లో పంట పొలాలకు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కుందేరు పరివాహక ప్రాంతాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాలక్రమేణ మురుగు, వ్యర్థనిల్వలతో, గుర్రపు డెక్కలతో వాగు పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అయితే అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు రూ.89 కోట్లుతో డీపీఆర్‌లు సిద్ధం చేయగా, అర్థాంతరంగా నిలిచిందని, అభివృద్ధి చేస్తే ఎంఎస్‌ఎంఈ పార్కుతో పాటు, నిరుపేదలకు నివేశన స్థలాలకు కూడా ఢోకా ఉండదని సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు.

వార్డుల విభజనపై కసరత్తు

● 20 నుంచి 27 వరకు పెరిగిన వార్డులు

అద్దంకి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీలో వచ్చే కౌన్సిల్‌లో 27 మంది కౌన్సిలర్లు ఉండనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 27 వార్డులుగా విభజించాల్సి ఉంది. ఈ నెల 29వ తేదీ లోపు వార్డుల విభజన పూర్తి చేయాల్సిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో కమిషనర్ రవీంద్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల విభజన సమయంలో శాస్త్రీయంగా విభజన జరిగేలా చూడాలన్నారు. కుటుంబసభ్యులు అందరూ ఒకే వార్డులో ఉండడంతో పాటు వార్డులు విభజించే సమయంలో వీధులను హద్దుగా తీసుకోవాలన్నారు. అదే సమయంలో ఆయా వార్డులలో ఓటర్ల సంఖ్యలో కూడా ఎక్కువ వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

మార్టూరు,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి ఏవో లావణ్య అవగాహన కలిగించారు. శుక్రవారం మండలంలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి స్థానికంగా ఏవో కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి వరిపంట గ్రామానికి యూనిట్‌గా, జిల్లా యూనిట్‌గా కంది, మినుము పంటలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రసాద్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.